కథానిక:

ఎవరిది తప్పు?

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యరావు

పిల్లడికి ఒంట్లో బాగులేదని ఆస్పత్రికి తీసికెళ్లినప్పుడు అప్రయత్నంగా కమల కనుపించింది. అతని కెంతో ఆశ్చర్యం వేసింది. తనతో చిన్నప్పుడు చదువుకుంది. ఎంత అందంగా ఉండేది! బాగా మారిపోయింది.

“ఇక్కడి కెలా వచ్చావు. ఇంతదూరం?”

“ఇక్కడే ఉంటున్నాను కొంతకాలమై—మీ రిక్కడేం చేస్తున్నారు?”

“ఏదో ఉద్యోగం—కడుపుకోసం—”

పక్కన నవ్వింది. ఎందు కలా నవ్వుతుంది. తెలీదు.

“మీ ఇల్లెక్కడ?”—ఫలానా చోట అని చెప్పేడు.

“సాయంత్రంవొస్తాలెండి—”వెళ్లిపోయింది.

ఆ బట్టలూ, తలా, అదీ ముష్టిదానిలా తయారయిందేం? చిత్రంగా ఉంది—సాయంత్రం కనుక్కోవచ్చు అనుకున్నాడు. డాక్టరు పిల్లవాడిని ఆస్పత్రిలో జాయిన్ చెయ్యాలన్నాడు. ఏదో ఆపరేషన్ కూడా చెయ్యాలట—పాపం, సుబ్బారావు గుండెల్లో రాయి పడింది!—

రెండురోజు లయింది. కమల రాలేదు. దూరాన్న మైదానంమీద పిల్లలు ఆడుకుంటున్నారు తనూ కమలా ఇలాంటివెన్నో ఆటలు ఆడుకున్నారు చిన్నప్పుడు. అప్పుడెంతో చక్కగా ఉండేది—ఆ నల్లటి కళ్లు, పెద్ద జుత్తు, సన్నని శరీరం ఎన్నోసార్లు జ్ఞాపకానికి వొచ్చాయి. ఆ రోడ్డుమీద కాని, ఆ విశాలమైన మైదానం మీద కాని ఎప్పుడేనా వొంటరిగానడిచి పోతుందేమో అనుకునేవాడు. రహస్యంగా తనలో దాగిఉన్న తీరని కోరికల్నీ, హృదయదౌర్బల్యాన్నీ తలచుకొని సిగ్గుపడ్డాడు.

చిన్నప్పుడు తను నీలి ఆకాశంమీద, మైదానపు నీడలమీద, కమల చక్కదనం మీద ఎన్నో పద్యాలు రాశాడు. ఆ రోజుల్లో తన జీవితమొక్క అవ్యక్త మధురస్వప్నం—ఫలపుచురుకులతో, వలపు కులుకులతో, వొళ్లు తెలియని వూహల్లో ప్రపంచాన్ని మరచిన రోజులవి. అవి అల్లసానివారి అల్లిక జిగిబిగి ప్రబంధకావ్యం. ఒక కాళిదాసు రసైక నాటకం.

కాని కాలం మారింది. కడుపుకోసం దేశాలంట పోయి, ఉద్యోగం, సంపాదన—పిల్లలూ-సంసారం. తన కిప్పుడా మైదానపు నీడల్లో నీలి ఆకాశంలో మాధుర్యమేం కనిపిస్తుంది. చిత్రమైన పరిస్థితులలో మొరటువారిన హృదయాలకి ఆ నల్లని మబ్బుల వెనకనుంచి వచ్చే నిర్మల తేజస్సు నిర్జీవమై వ్యర్థమైనదిగా కనుపిస్తుంది కాబోలు. కమల వచ్చి “సుబ్బారావుగారూ” అని పిలిచింది. తుళ్లిపడి లేచాడు.

“రా, కూర్చో—” ఆమె కూర్చుంది.

“ఎంతకాలానికి మళ్లీ...బాగా నల్లబడిపోయావేం—”

అందమయిన మనిషి పాడయిపోయింది. చిరిగిన చీరలోంచి నలిగిన శరీరం కనిపిస్తోంది—నీరసంగా కృశించిన ఆముఖంలో, ఆ పెద్ద కళ్లలో స్పష్టమైన ఆవేదనా, బాధా కనుపిస్తున్నాయి. నిశ్శబ్దంగా ఆమె ముఖంలోకి చూశాడు.

“మరచిపోయావా—ఆ రోజులు—ఆ కథలూ, ఆ గాథలూ—”

“కాలం మరిపిస్తుంది—” అతను నిట్టూర్పు తీశాడు.

“మీ రింకా కవిత్వం రాస్తున్నారా?—”

“పోయింది, అంతా—ఈ Struggle for Existanc‹ నాలో ఉండేరసజ్ఞతని, ఉద్రేకాన్ని బలి తీసుకుంది.”

ఆమె నవ్వింది. “పాపం. మీకు పరిస్థితులలోంచి ఉద్రేకాన్ని తీసుకోడం చేతకాదు-”

“సరిలే—నీ సంగతేమిటి?”

“మా నాన్న చనిపోయాక నా చదువు ఆగిపోయింది—మే మసలే బీదవాళ్లం. చాలాకాలం వరకూ పెళ్లి కాలేదు. నా కోసం మా అమ్మ బెంగపెట్టుకుని చనిపోయింది. నేను అసహాయంగా సామాజిక దౌర్జన్యాలలో నలిగి ఇలా తయారయాను—” ఆమె నిశ్శబ్దంగా నేలకు చూస్తోంది “ఛీ” సుబ్బారావుకి అసహ్యమేసింది—

“కూలి చేసుకోవలసింది—” అంటూ ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె ముఖం పక్కకు తిప్పి ఏడుస్తోంది. మంచుగడ్డ కరిగినప్పుడు మురికి జారి నిర్మలంగా అగునట్లు ఆకళ్ళలో బాధ, అమాయకత్వం గోచరించాయి.

“నాలాంటిది కూలి చేసుకున్నా. కూలి దానిలా బతకనిస్తారా పెద్దమనుష్యులు—” ఆమె వెక్కి వెక్కి ఏడిచింది.

“సమాజమే మమ్మల్ని సృష్టించి, తిరిగి శిక్షిస్తుంది! మంచిగా ఉండమంటుంది. ఉండదలచుకున్న వాళ్ళకి మాత్రం అవకాశాలు ఇవ్వదు—”

నిజమే—అతనికి ఆశ్చర్యమేసింది. ఆమె తప్పేముంది పాపం? తనే అప్పుడు తెగించి పెళ్లి చేసుకుంటే కమలకీగతి పట్టేదా? ఆమె జీవితాన్ని చీల్చినవాళ్ళల్లో తనొకడు.



భారత అధినివేశ ప్రభుత్వ ఆరోగ్యశాఖా కార్యదర్శి డా॥ జీవరాజమెహతాగారు గత గురువారం బొంబైలో ద్వితీయ రేడియో లాజికల్ సభ ప్రారంభోత్సవం జరిపారు.

“నీకు నేను ఏం సహాయం చెయ్యగలనో చెప్పు...”

“చెయ్యవలసిన సమయంలో చెయ్యలేదు. ఇప్పుడేం చేస్తే ఏం లాభం—”

ఇరవై రూపాయలు తీసిఇచ్చాడు—ఆమె తీసుకుంది. “నీకుమళ్ళీ అవసరమైతే కనబడు. ఆ నీచపుబతుకు మాను—నీబతుకు తెరవు గూర్చి నే నేర్పాటు చేస్తాను”—ఆమె “అలాగే” నని వెళ్లి పోయింది.

మర్నాడు తను ఆస్పత్రికి బయలుదేరుతుండగా ఆఫీసు బంట్రోతు వచ్చి మేనేజరుగారు రమ్మన్నా రన్నాడు.

“ఇవాళ సెలవు దొరకలేదా?” అంటూ వీధిలో కొచ్చిన సుబ్బారావుగారి భార్య—“ఎలాగ పిల్లడికి, ఆపరేషను కూడా చేస్తానన్నాడు డాక్టరు—ఇదేం ఉద్యోగమండీ దిక్కుమాలిన ఉద్యోగం అంది”.

సుబ్బారావు నిస్పృహగా చతికిల బడ్డాడు.

“నువ్వెళ్ళు ముందు—తీరుబాటు చేసుకుని నే వస్తాను—”

“బాగాఉంది. ముష్టినాకరీ”—అంటూ వెళ్ళింది ఆమె—ఈ వెధవ నౌకరిలో నూరు రూపాయిలిచ్చి రెండువందలరూపాయల విలువగల పనిచేయిస్తారు—చెయ్యకపోతే హెడ్ గుమస్తా చంపుతాడు—తన జీతం జీవితం వాడి చేతుల్లో ఉంది—వాడేనా అంతే. వాడిని ఆఫీసరు తిడతాడు—ఆఫీసరు ప్రాణాలు మేనేజరుచేతిలో ఉంటాయి. అంతా అలాగే—కాని ఆ నమ్రతకి ఒక పరిమితి లేదు. పైవాడు తప్పుచేసినా కిందవాడు ఊరుకోవాలి. కిందవాడిం తప్పు చెయ్యమన్నా, అన్యాయం చెయ్యమన్నా చెయ్యాలి. మొన్న ఆఫీసులో పనిచేసుకుంటూంటే హఠాత్తుగా విదేశదిగుమతులు ఆగిపోయాయని వార్తవచ్చింది. వెంటనే మేనేజరు తన్ను పిలచి, సరుకు ఖరీదు రెండురెట్లుచేసి, చెప్పమన్నాడు.

“నిన్న ఇంగ్లాండునుంచి వచ్చిన మిషన్లమీద కంట్రోలు ధర ఉంది”

“నీముఖం—కంట్రోలుధర ఉంటే ఏం—కొంప మునిగిపోయిందా—మార్కెట్టుసంగతి ఆలోచించాలి—సరుకు బాహాటంగా అమ్మడం మానీ—”మేనేజరు ఇలా అనగానే, తన గుండెలో ఎవరో బల్లెంతో పొడిచినట్లైంది. ఎంతో నీచమైన పని తనచేతులతోనే చెయ్యాలి. ఈ లాభాలవల్ల వర్తకులు మేడలు కడతారు—అందుకు తనుకూడా సహాయపడతాడు. కారణం—ఈసమాజధర్మం ఒక సన్నని వంతెన-పక్కకి తప్పితే కాలు జారి ఎటు పడిపోతాడో తెలీదు. చీకటిపడింది. కానిదూరాన్న నీలికొండల వెనక ఎర్రటి ఆకాశం ఇంకా ఉంది. ఆ విశాలమైన మైదానపు పొలిమేరల్లో జీర్ణదేహాలతో జీవితంపై వెర్రి ఆశతో నల్లటి నీడల్లా నడచిపోతున్నారు కొందరు కూలివాళ్ళు. మానవత్వాన్నే అమ్ముకుంటేకాని బతకడానికి వీలు లేదు ఈ లోకంలో. ఆకలి, దారిద్ర్యం, అనే పదాలవెనక ఎంతో మానవత్వం అణగారి నిట్టూర్పు తీస్తోంది. కాని జీవితాన్ని, కష్టాలతోనూ, బాధలతోనూ ఉన్నపాళంగా అంగీకరించాడు. మానవనిర్మితసమాజాన్ని, దాని సమస్యలని చక్కగా అర్థంచేసుకుని, ఈ దారిద్ర్యపుపాతరలోంచి, నీచపు బతుకులోంచి బయట పడుతామనే, మానవుడు ఎప్పుడు తన నైతిక పోరాటాన్ని సాగిస్తూనే ఉంటాడు. ఆ అంతిమ విజయంమీద వాడికి నమ్మకం ఉంది. కాని, ఆ అమృతాన్ని అందుకొనే టప్పటికి కాలం చాలమందిని బలితీసుకుంటుంది—అలాగే తనుకూడా బలి అవుతున్నాడా? అయితే కమలను తను ఏమని వెక్కిరిస్తాడు? ఆమెకు ఎలాగైనా తను సహాయం చెయ్యాలి—

మర్నాడు తను ఆస్పత్రికి వెళుతూంటే దారిలో ఒక చోట చాల మంది ప్రజలు మూగేరు. ఏమిటని దగ్గరగా వెళ్ళి అడిగాడు: పోలీసు కాన్స్టేబుల్ గర్వంగా. “దొంగతనం చేసిందండీ—ఎక్కడికి పోగలదు తప్పించుకుని—” అన్నాడు.

తన గుండెలు దడదడ కొట్టుకున్నాయి. కమల చేతికి సంకెళ్ళు వేసిఉన్నాయి.

ఆశ్చర్యంగా “కేసు రుజువయిందా? దొంగతనమా?” అన్నాడు. “రుజువవాలటండీ—ఇది కాకపోతే ఇంకెవ్వరు తీస్తారా ఇంట్లో—ఇలాంటివాళ్లు చాలా అసాధ్యులండోయ్, మీకు తెలీదు—”అన్నాడు పోలీసు తన అనుభవాన్ని వెల్లడిస్తూ—కమల అమాయకంగా తనవేపు చూసింది. పోలీసువాళ్లు ఆమెను తీసుకెళ్ళిపోయారు. బరువైన గుండెతో తను ఆస్పత్రికి వెళ్ళిపోయాడు.



మాంబళం శారదా విద్యాలయంవారు మాతా శారదాదేవి జన్మదినోత్సవం జరిపారు. ఉత్సవాలకు అధ్యక్షతవహించిన శ్రీమతి కమలాదేవి (పూలమాల చేతిలో నున్నవారు) ఆమె కుడివైపున శ్రీమతి అనసూయాబాయ్ కాళేగారలు ఈ చిత్రంలో కనిపిస్తున్నారు.